క్లుప్తంగా

బులియన్, బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



పొన్నూరు: పట్టణంలోని ఎ.పి.జె అబ్దుల్ కలాం షాదీఖానాలో ఆదివారం అంజుమన్ కమిటీ కార్యవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అంజుమన్ అధ్యక్షులు ముగ్బుల్ బేగ్ అధ్యక్షత వహించారు. అంజుమన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఇటీవల పొన్నూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన షేక్.బాజీ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి షేక్.బాజీ బాబా, కోశాధికారి మహమ్మద్ ఖాసింలను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు అంజుమన్ కమిటీ కార్యదర్శి షేక్.బాజీ, కోశాధికారి మహమ్మద్ గౌస్, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుంటూరు రూరల్: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చిలకలూరిపేట నుంచి గుంటూరు వస్తున్న కారు చౌడవరం వంతెన వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు వంతెన పైనుంచి కిందపడి నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్‌కు గాయాలవ్వడంతో స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం సమయంలో హైవేపై ఎటువంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులకు అడుగగా ఎటువంటి సమాచారం లేదని అన్నారు.

మొదలైన వార్షిక మహోత్సవాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో కొలువుదీరిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య సమేత అమ్మవారి 27వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు దండిబొట్ల కృష్ణశర్మ, మాధవశర్మలు అఖండ జ్యోతి స్థాపనతో వేడుకలను ప్రారంభించారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. తొలిరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా నేడు శ్రీ ఆదిశక్తి అంకమ్మతల్లికి బోనాల సమర్పణ, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లికి కంకుమ, మల్లెపూలతో సహస్ర నామావళి, సాయంత్ర బలిహరణ, రాత్రి స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరగనున్నాయి.

ఉచిత వైద్య శిబిరం



పెదకాకాని: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసుబాబు అన్నారు. మండలంలోని నంబూరులో ఆదివారం సమగ్ర హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఎక్కువ మంది గుండె, నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారని, ప్రాథమిక దశలో వాటిని గుర్తించడం, చికిత్స చేయించుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆయన అన్నారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సాంబశివరావు, డాక్టర్ జాన్ షాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఈషా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర ఎమ్.నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎమ్.హర్షవర్ధన్, డాక్టర్ కె.శంకర్‌రెడ్డిలు గ్రామంలోని సుమారు 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

పెదకాకాని: ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని సి.పి.ఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో ఆదివారం ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి సంఘీభావంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ.. పహల్గాం ఘటన అమానుష చర్య అన్నారు. అమాయకులపై కాల్పులు జరపడం హేయమైనా చర్య అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, నిఘా వర్గాలు మేల్కొని ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఎం.శ్రీనివాస్, రాజా రమేష్, బాబురావు, యు.శివయ్య, నాగేశ్వరరావు, మస్తానమ్మ, ఎస్కే జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

30తో ముగియనున్న ఈకేవైసీ గడువు

- ఈకేవైసీ చేయించకుంటే నిలిచిపోనున్న రేషన్
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 8,693 మంది పెండింగ్
- గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల్లో 28 వేల మందికి పైనే

మండలం	కార్డుల్లోని సభ్యులు	ఈకేవైసీ అయినవారు	మిగిలినవారు
పెదనందిపాడు	35,020	32,352	2.235
వట్టిచెరుకూరు	40,004	37,393	2,171
ప్రత్తిపాడు	42,271	39,402	2,478
కాకుమాను	34,109	31,914	1,809
గుంటూరు వెస్ట్	2,49,573	2,33,860	13,231
గుంటూరు ఈస్ట్	3,00,224	2,81,731	15,571
మొత్తం	7,01,201	6,56,652	37,495



ఈకేవైసీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు (ఫైల్)



గ్రామాల్లో ఎండీయూ వాహనాల వద్ద చేస్తున్న ఈకేవైసీ (ఫైల్)

ప్రత్తిపాడు: మీకు రేషన్ కార్డు ఉందా.. ఈకేవైసీ పూర్తి చేసుకున్నారా.. లేదంటే త్వరతగతిన చేయించుకోండి. ఎందుకంటే ఈకేవైసీకి గడువు మరో మూడు రోజులే మిగిలి ఉంది. ఈ నెల 30తో పెంచిన గడువు ముగుస్తుంది. నిర్ణీత సమయంలోగా రేషన్ కార్డుదారులు రేషన్ షాపులు లేదా మీసేవా కేంద్రాలు, ఎండీయూ వాహనాల వద్ద బయోమెట్రిక్ ధృవీకరణ చేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో శనివారం నాటికి ఇంకా ఈకేవైసీ పూర్తి చేయించని కార్డు సభ్యులు 8,693 మంది, గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల్లో 28,802 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. వీరంతా గడువులోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోకుంటే రానున్న రోజుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. త్వరలో రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఏటీఎం సైజులో, క్యూఆర్ కోడ్‌తో రేషన్ కార్డులు జారీ చేయనున్న నేపథ్యంలో సమస్యలు తలెత్తే వీలు అధికంగా ఉంది.

నిలిచిపోనున్న రేషన్..

కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామంటూ చెబుతుంది. కొత్త కార్డుల జారీ కంటే ముందే రేషన్ కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఈకేవైసీ ద్వారా రేషన్ కార్డులోని సభ్యులు ఆధార్ బయోమెట్రిక్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈకేవైసీ పూర్తి చేయకపోతే కార్డులో సభ్యుల రేషన్ నిలిచిపోయే అవకాశమూ లేకపోలేదు. ఈకేవైసీ ద్వారా అనర్హులను, నకిలీ రేషన్ కార్డులను గుర్తించి తొలగించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందించే సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకే ఈకేవైసీ చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

త్వరగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి..

రేషన్ కార్డులోని లబ్ధిదారులు త్వరితగతిన ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఏప్రిల్ నెలాఖరు వరకు మాత్రమే ఈకేవైసీకి గడువు ఉంది. ఆ తరువాత ఈకేవైసీ చేయించుకోవడం సాధ్యపడదు. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఈకేవైసీ చేశాం. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లో సుమారు 8,500 మంది పైనే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వారంతా సాధ్యమైనంత త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలి.

– శివశంకర్ (డీటీ, సివిల్ సప్‌లెస్, ప్రత్తిపాడు మండలం)

30న ప్లాటినం జూబ్లీ భవన ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి

పెదకాకాని: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు మనం కూడా తిరిగి ఇవ్వాలని చేసిన మంచి ఆలోచనే ప్లాటినం జూబ్లీ భవనం అని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఈమని ప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు శ్రీ పోలయ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ప్లాటినం జూబ్లీ భవనం ఈనెల 30న ప్రారంభోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. నంబూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రారంభించి 2021 నాటికి 75 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికగా 2022 సంవత్సరం మార్చిలో ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు. ఈ వేడుకలు నిర్వహించగా రూ.11.93 లక్షలు మిగిలాయని.. ఆ నగదుతో పాటు పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో భవనం నిర్మించినట్లు పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు, సంఘం గౌరవ అధ్యక్షులు వాసా మాణిక్యాలరావు, సంఘం సభ్యులు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. జడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం సీహెచ్ కొండయ్య, కమిటీ సభ్యులు కుర్రా కృష్ణ, ఆరదల శంకరరావు, గాడికో సర్వారెడ్డి, సలహా కమిటీ సభ్యులు నంబూరు కిషోర్, దినేష్ రెడ్డి, రాజమన్నార్, తులాబందుల తాతయ్య, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లంకపల్లి నాగరాజు పాల్గొన్నారు.

మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిలోని కె.సి వర్క్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి సి.ఐ.టి.యు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. అందులో భాగంగా వినాశకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మే 20వ తేదీ జరుగనున్న జాతీయ సమ్మెలో తాడేపల్లి ప్రాంతంలో ఉన్న కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు వేముల దుర్గారావు, ఎ.ఐ.టి.యు.సి నాయకులు టి.వెంకటయ్య, ఎ.ఐ.ఎ ఫ్.టి.యు(న్యూ) నాయకులు ఆదినారాయణ, ఐ.ఎ న్.టి.యు.సి నాయకులు దర్శనపు సామేలు, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ నాయకులు కూరపాటి స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలని.. లేకుంటే పి.డి యాక్ట్ అమలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి పట్టణ యస్ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ఐ హరిబాబు మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని.. సన్మార్గంలో నడవాలని కోరారు. కేసులపాలుకాకుండా కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల నేరచరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది బాబూరావు, ఏడుకొండలు, సుధీర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దంతలూరులో భగవద్గీత ప్రచారం

దంతులూరు(తెనాలి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక' గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం కొల్లిపర మండలంలోని దంతులూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. గ్రామస్తులకు గురువు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి గ్రామస్తులకు వివరించి, వారి జీవితంలో జ్ఞానమార్గాన్ని అనుసరించాలని కోరారు. పౌర్ణమి అనేది పూర్ణ దైవ జ్ఞానానికి, అమావాస్య అజ్ఞానానికి గుర్తు అయినందున అజ్ఞానం నుంచి వెలుగు వైపునకు అంటే దైవజ్ఞానం వైపు ప్రయాణించాలని సూచించారు. అమావాస్యకు పౌర్ణమికి మధ్యలో అష్టమి తిథి రోజున శ్రీకృష్ణుడు జన్మించి జ్ఞానం అజ్ఞానానికి మధ్యలో వారధిలా కనిపిస్తాడని చెబుతూ శ్రీకృష్ణుడిని విశ్వసిస్తే పౌర్ణమివైపు నడిచి, జ్ఞానం తెలుసుకుని మోక్షం అందుకోవచ్చని తెలిపారు. శ్రీకృష్ణుడిని, భగవద్గీతను విశ్వసించకపోతే అమావాస్య వైపు నడచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరని చెప్పారు. ప్రచారంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి-ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు టీవీ కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి.బ్రహ్మం, శ్రీను, బి.రామోజీనాయక్, జె.హరిబాబు, సుబ్బారావు, ఎస్కే దిల్ష, అన్నపూర్ణ, చంద్రిక పాల్గొన్నారు.

నగదు, బంగారం చోరీ

చేబ్రోలు: ఇంట్లోవారు శుభకార్యానికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారు వస్తువులు అపహరించిన సంఘటన చేబ్రోలులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రెసిడెన్సీ హైస్కూల్ రోడ్డులోని దారం అప్పారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని రూ.40 వేల నగదు, బంగారు ఆభరణాలు మాయమైయ్యాయని.. సుమారు రూ.లక్ష వరకు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పిల్లలకు పుస్తకాలు చదవడం, రాయడం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లీష్, అల్లికలు వంటి వాటిపై రీసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ ఇస్తామని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


వేసవి శిక్షణ ప్రారంభం నేడు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథా లయ ఇన్‌చార్జి పి.జేమ్స్ ఆదివారం తెలిపారు. ఉద యం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు పలు అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన మల్లవరపు విజయ్, ఉన్నం రవి, మరి కొంతమంది శనివారం సాయంత్రం మద్యం సేవించి, గ్రామ పెద్ద కాల్వ వంతెన పైన స్కూలు, కాలేజీ బస్సులు, ఇతర వాహనాలకు అటకాయించి, వాహన డ్రైవర్లపై దురుసుగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా వాహన రాకపోకలను సుమారు 30 నిమిషాలు అడ్డుకున్నారు. పబ్లిక్ స్థలంలో ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ ఆదివారం తెలిపారు.

వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం జరిగే ఉచిత షుగరు వైద్యశిబిరాన్ని ఈ ఆదివారం బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్.భవనంలో నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 200 మంది రోగులకు ఉదయం అయిదు గంటల నుంచి షుగరు, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు కూడా చేశారు. షుగర్ పరీక్షలకు ముందు తర్వాత రెండు రకాల అల్పాహారాలు అందించారు. నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం రోగులకు ఆహారం, వ్యాయామం ప్రాధాన్యతపై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. క్యాంపులో 20 మంది వలంటీర్లు సహకారం అందించారు.

కనుల పండువగా అద్దంకమ్మ తిరునాళ్లు



వట్టిచెరుకూరులో సిడిమాను ఊరేగింపు



లక్ష గాజులతో విశేష అలంకరణలో అమ్మవారు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో కొలువుదీరిన అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అద్దంకమ్మ తల్లికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని లక్ష గాజులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి సేవలో పాత్రులయ్యారు. సాయంత్రం నిర్వహించిన సిడిమాను ఉత్సవం కనులపండువగా సాగింది. అశేష భక్తజనుల నడుమ సిడిమానును ఘనంగా ఊరేగించారు.

అ'పూర్వ' కలయిక.. ఆనంద వేడుక



గురువులతో పూర్వ విద్యార్థులు

చేబ్రోలు: మండల పరిధిలోని సంగం జాగర్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. వారంతా తమ జీవితాల్లో సాధించిన విజయాల గురించి వేదికపై పంచుకున్నారు. సమ్మేళనానికి హాజరైన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు డెప్యూటీ డీఈవోగా పనిచేసి రిటైర్డు అయిన వీసం వెంకటేశ్వరరావు, ఇక్కడ ఉపాధ్యాయులుగా పనిచేసి ప్రస్తుతం ఇదే హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న శివరామకృష్ణ, వివిధ ప్రాంతాల్లోని పి.కోటిరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, సత్యవాణిలతో పాటు 30 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం



పూలతో అలంకరించిన కరిముల్లా షా ఖాదరి నిషాని



ఉరుసు మహోత్సవం

పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవం వైభవంగా కొనసాగుతుంది. పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 16వ ఉరుసు గంధ మహోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండోరోజు ఆదివారం రాత్రి 10 గంటలకు కరిముల్లా షా ఖాదరి నిషాని నుంచి గంధం, గుట్బం బయలు దేరింది. వేడుకలను పురస్కరించుకుని కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం కళకళలాడింది. ప్రార్థనా కార్యక్రమాల అనంతరం ఉరుసు మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ రాత్రి వేళల్లో అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు ధర్మకర్త పఠాన్ మాహబుసుబాని తెలిపారు.

సహచర విద్యార్థికి ఘనంగా సన్మానం



కృష్ణరాజేంద్ర దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగళగిరి టౌన్: ప్రముఖ సైంటిస్ట్ నీలి కృష్ణరాజేంద్ర దేశం గర్వించే స్థాయికి ఎదిగారని మంగళగిరి సి.కె హైస్కూల్ 1982 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కల్యాణ మండపంలో ఆదివారం నీలి కృష్ణరాజేంద్రకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తమ బ్యాచ్ విద్యార్థి ప్రముఖ సైంటిస్ట్ నీలి కృష్ణరాజేంద్ర అధునాతన మధ్యస్త పోరాట విమానాలు రూపొందించడం, డిజైన్ చేయడం, నిర్మించడంలో ఆయన సాధించిన అద్భుత విజయాలకు గాను ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం ఆయన బెంగళూరులోని ఎరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో ఎ.ఎం.సి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. 40 సంవత్సరాల క్రితం కలసి చదువుతున్న తమ సహచర విద్యార్థి కృష్ణరాజేంద్ర దంపతులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాడికొండ తిరుమలరావు, రావెల శ్రీనివాసరావు, సీతారామప్రసాద్, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసరావు, దామర్ల కుబేర స్వామి, శ్రీకృష్ణ దేవరాయలు, ఉడతా వెంకటేశ్వర్లు, దామర్ల వీరాంజనేయులు, వాల్మీకి శ్రీనివాసరావు, దేవళ్ల పుల్లయ్యతో పాటు ముఖ్యఅతిథిగా టి.డి.పి శాసనసభ కమిటీ కార్యదర్శి కోనేరు సురేష్, గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త బండ్ల మాధవరావు పాల్గొన్నారు.

మానవ హక్కులను రక్షించే దిశగా పనిచేయాలి



సాయిచంద్‌ను సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: అవినీతి, నేరాలను నిరోధించడంతో పాటు మానవ హక్కులను రక్షించే దిశగా పనిచేయాలని పలువురు సి.పి.ఐ నాయకులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని తమ పార్టీ కార్యాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన చదలవాడ సాయిచంద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజల్లో అవినీతి, నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన వ్యక్తి ఈ పదవి పొందడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు హ్యూమన్ రైట్స్ సంస్థ తరఫున అవసరమైన సేవలు అందిస్తానని సాయిచంద్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, అన్నవరపు ప్రభాకర్, జాలాది జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.